# పెరటితోట

రెండెకరాల భూమికల ప్రదేశంలో ఉన్నది ఆ బంగళా. చుట్టూ సిమ్మెంటు కాంక్రీట్ స్తంభాలు పాతి, బార్బ్డ్ వైర్ ఫెన్సింగు ఉంది. దాని ప్రక్కన చిల్లంగి కంప ప్రహారీ గోడ లాగ పెరిగింది. బంగళా ముందు కోట సైనికుల్లా నాలుగు నిద్రగన్నేరు చెట్లు, రెండు వేప చెట్లు ఉన్నాయి. వాటి నీడకు బంగళా ముందు ప్రదేశ మంతా నీలగిరివలె చల్లగా ఉంటుంది. రమారమి ఓ అర ఎకరం మేర బంగళా వెనుక పెరటి దొడ్డి ఉంది. దాన్ని ఆనుకునే వంట కొటకు ప్రత్యేకంగా ఓ బోట్ హౌస్. అన్నింటినీ మించి నీటి వసతి బ్రహ్మాండంగా ఉంది. రెండు వరల బావులూ, ఒక పంపూ.

ఆ ఊరు బదిలీ చేయబడి, కొత్తగా ఆ బంగళా లోకి ప్రవేశించిన అసిస్టెంటు ఇంజనీరు విశ్వనాథరావుకీ, ఆయన భార్య విశాలాక్షమ్మకూ ఆ బంగళా చూచిన మీదట తన్నితే గారెల బుట్టలో పడ్డ సామెత స్ఫురణ కొచ్చింది. ముఖ్యంగా విశాలాక్షమ్మకు ఆ బంగళా ఎంతో బాగా నచ్చింది. లంకంత పెరటి దొడ్డి ఉంది. సారవంతమైన నేల, ఏ మొక్క పెట్టినా ఇట్టే ఏపుగా ఎదుగుతుంది. భర్తకు ఉద్యోగమైన పదహారు సంవత్సరాలలో దాదాపు పది వూళ్లు చూసింది. కాని ఎక్కడా ఇంత వసతైన బంగళా దొరకలేదు. అందుకే విశాలాక్షమ్మ విపరీతంగా మురిసి పోయింది.

ఆ బంగళాలో చేరిన మరునాడే విశాలతమ్మ ముగ్గురు జమానులనూ పిలిచింది. వాళ్లు అమ్మగారి పిలుపుకు తత్తర పడిపోతూ, గబ గబా తలగుడ్డలు చుట్టుకొని, చేతులు కట్టుకొని, అతి వినయంగా నిల బడ్డారు. చెప్పింది తడవుగా ఏ పనైనా చేసే ఆవేశంతో.

"నాకు పెరటితోట పెంచడ మంటే మా చెడ్డ సరదా. మహాత్మాగాంధి, లాల్ బహదూర్ శాస్త్రి గారలు పెరటి తోటల పెంపకం ఆవశ్యకతను గురించి ఎంతో గొప్పగా చెప్పారు. దేశంలో ఆహార సమస్యా పరిష్కారానికి ఒక రకంగా అవి సహాయ పడతాయి. ఏమైనా ఈ పెరటి తోట దూడబోయిన ఆవులా బావురు మంటోంది. ఒక్క చెట్టు నీటిమొహం చూసినట్టు లేదు. ఎండిపోయి రోతగా ఉన్నాయి. ఇంతకు ముందున్న ఇంజనీరుకూ, ఆయన భార్యకూ పెరటి తోటలపై అభిప్రాయం ఉన్నట్టు లేదు. ఈ దొడ్డిని యింత అధ్వాన్నంగా చేసి పోయారు. ఇప్పు డట్లా కాదు. ఒక్క నెల రోజులలోనే పెరటి దొడ్డంతా పచ్చని చెట్లతో నిత్యకల్యాణం పచ్చ తోరణంగా కళ కళ లాడుతూ వుండవల్సిందే! వింటున్నారా? జాగ్రత్త. నేను చెప్పినట్టు మసులుకోండి. నా మాట విన్న తర్వాతే అయ్యగారి మాట! ఇవాళ ఈ చిన్న చిన్న చెట్లనీ, మొక్కల్ని పీకి వేయండి. నాలుగు చెలగ పారలు తీసుకొని రేపు నేల నంతటినీ త్రవ్వి పదును చేయండి. ఆ సపోటా చెట్లకూ, జామ చెట్లకూ, కరివేపాకు చెట్టుకూ, గులాబీ మొక్కకూ, నందివర్ధనపు మొక్కకూ చక్కగా పాదులు చేయండి. మల్లె చెట్టుకు పందిరి కట్టండి. ఈ పనులన్నీ నిమిషాలమీద జరిగి పోవాలి. శరీర శ్రమ దాచుకొని, ఆలస్యం చేస్తే – అయ్యగారి

రికార్డు పుస్తకాలలో మీ పేర్లు ఎర్ర సిరాతో వ్రాయబడతాయి" అన్నదావిడ గంభీరంగా, గుక్క తిప్పుకోకుండా.

ఆ జమానులు గంగిరెద్దులవలె తలలు ఆడించారు. అమ్మగారి మాటల్ని అక్షరాల ఆచరణలో పెడతామని మనవి చేసుకున్నారు.

పేరుకు విశ్వనాథరావు ఇంజనీరైనా ఓ వొంతు ఆయన భార్య విశాలాక్షమ్మ ఉద్యోగాన్ని నిర్వహిస్తూ ఉంటుంది. ఆయన ఔట్ డోర్ వర్కు చూసుకోవాల్సిందే. ఎక్కడ బ్రిడ్జి కడుతున్నా, ఎక్కడ రివిట్‌మెంటు వర్కు చేస్తున్నా, ఎక్కడ ఎర్తువర్కు జరుగుతున్నా, స్లాబ్ పోస్తున్నా ఆయన విధిగా హాజరవుతాడు. తన క్రింద ఉద్యోగస్తుల సామర్థ్యాల పైన ఆయనకు నమ్మకం తక్కువ. కాని ఆఫీసులోని ఎస్టిమేటూ ప్లాన్లూ, నామినేషన్లూ, కరస్పాండెన్సూ - వీటి విషయంలో ఆయన తరచూ భార్యను సంప్రదిస్తూ వుంటాడు. అంటే ఆవిడ ఇంజనీరింగు కోర్సు ఏమాత్రమో చదువుకున్నదని కాదు. ఆ విషయాలలో ఆవిడకు మహా ఆసక్తి ఉంది. విశ్వనాథరావు శక్తి వంచన లేకుండా, అనుభవం ప్రసాదించిన సామర్థ్యంతో పని జేసేవాడే గాని, నాలుగు రాళ్ళు సంపాదించడంలో రవ్వంత నేర్పు లేదు. ముక్కుకు సూటిగా పోయి, ఏ గోడకో ఆ ముక్కును "ఢీ" కొట్టిస్తాడు. కాబట్టి పేరుకు ఆయన ఉద్యోగం చేస్తూ వుంటాడు. ఆ ఉద్యోగం ద్వారా ఆవిడ డబ్బును కూడ బెడుతూ వుంటుంది. మరి ఐదుగురు పిల్లలు. వాళ్ళకు చదువులూ, దుస్తులూ, నగలూ, పెళ్ళిళ్ళూ, కట్నాలూ, కానుకలూ, పెట్టుబడులూ, జీవితంలో నిబ్బరంగా స్థిరపడటాలూ - వీటన్నింటికీ మూలవిరాట్టు డబ్బే.

గదా! దీపం ఉన్నప్పుడు దాన్ని రాబట్టుకోక పోతే, చేతులు కాలాక ఆకులు పట్టుకొని మాత్రం ప్రయోజన మేముంది? ఆ విధంగా ఆవిడ ఆర్గ్యూచేస్తూ ఉంటుంది - ఎప్పుడైనా భర్త తాను ఉద్యోగ ధర్మానికి అపకారం చేస్తున్నానని కాస్త జంకి మాట్లాడి నప్పుడు.

విశాలాక్షమ్మ "ఊఁ" అననిదే విశ్వనాథరావు ఏ ఎస్టిమేటును తయారు చేయించడు! ఏ కాంట్రాక్టరుకీ నామినేషన్ వర్కు ఇవ్వడు; ఏ మెజర్‌మెంటు బుక్కులోనూ కొలతలు మార్చడు; తరుణంలో ఏ కెనాల్‌కూ నీళ్లు వదలడు; ఏ ప్యూనును బదిలీ చేయించడానికీ ప్రయత్నించడు. కాబట్టి కంట్రాక్టరూ, రైతులూ, ప్యూన్లూ, అయన చేత పని చేయించుకో దలచిన వాళ్ళెవరైనా సరే ముందుగా ఆవిడను దర్శించుకుంటూరు.

అమ్మగారి ఆజ్ఞానుసారం హెడ్ ప్యూన్ రాములు వెంటనే ఇరువురి ఓవర్సీర్ల దగ్గర్నుంచి ఇద్దరు లస్కర్లను పిలిపించి సబ్ డివిజన్ ప్యూన్లతో సహా అయిదుగురికి పని పురమాయించి తను కూడా నడుం వంచాడు. వాళ్ళంతా మధ్యాహ్నానికి పెరటి దొడ్డిని అద్దంలాగా తయారు చేశారు. హెడ్ ప్యూన్ రాముల్ని పిల్చి మెచ్చుకుంది విశాలాక్షమ్మ. రాములు కోటప్ప కొండెక్కి నంతగా సంబరపడ్డాడు. అయ్యగారి పస, అమ్మగారి బిస - ఇట్టే కనిపెట్టారు జమాన్లు. అందుకే ఆవిడ మెచ్చుకోలు వాళ్ళకి పరమానంద భరితం.

"ఒరేయ్ రాములూ! ఈ ఊళ్ళో మంచి కూరగాయల విత్తనాలు దొరుకుతాయా?" అన్నది విశాలాక్షమ్మ ఆ రోజు సాయంత్రం.

"ఎందుకు దొరకవు అమ్మగారూ! మీరేమీ అనుకోకుండా

వుంటే,—పాలెంలో ఓ బుల్లి కంట్రాక్టరొకాయన ఉన్నాడు. ఆయన ఓ రైతు. ఆయన దగ్గర అనేక రకాలైన విత్తనా లుంటాయి. కాకితో కబురంపితే, రెక్కలు కట్టుకొని వచ్చి మన బంగళా ముందు వాలతాడు. మన పెరటి తోటకు కావల్సిన ఎరువులు కూడా ఆయనే సరఫరా చేస్తాడు." అన్నాడు రాములు వినయ విధేయతలతో చేతులు నలుపుకుంటూ.

"అయితే తెప్పించు!" అన్నది విశాలాక్షమ్మ తల ఆడిస్తూ.

"అట్లాగే నండి అమ్మగారూ!" అన్నాడు రాములు తల గుడ్డ సర్దుకుంటూ.

మరునాడు ఉదయమే రాములు ఆ బుల్లి కంట్రాక్టర్ను వెంట బెట్టుకొని ఆఫీసు ప్రక్కగా పెరటి దొడ్లోకి తీసుకొచ్చి అమ్మగారికి పరిచయం జేశాడు. పచ్చని దబ్బపండు వంటి శరీర చ్ఛాయ, ఉదయించే చంద్రబింబంలాంటి మొహమూ, ఒడ్డూ పొడుగులో నాయకురాలు నాగమ్మను బోలి, దమ్మిడీ అంత కుంకుమ బొట్టు పెట్టుకొని మెడ నిండా తట్టెడు నగలు వేసుకొని, వంగపండు రంగు కంచి పట్టుచీరె ధరించి అపర లక్ష్మీ దేవిలా వున్న ఇంజనీరుగారి భార్యను చూసి — భూమికి అయిదడుగుల ఎత్తులో ఉన్న బుల్లి కంట్రాక్టరు సాష్టాంగ ప్రణామం జేశాడు. ఆవిడ హోదాకు తగినట్టుగా చిరునవ్వు నవ్వింది.

"విత్తనాల సంగతీ, ఎరువుల సంగతీ, మీ పెరటి తోటను గురించి రాములు చెప్పగా శ్రద్ధగా విన్నాను. సాయంకాలానికి విత్తనాలు పంపిస్తాను. రేవు పది బళ్ళు ఎరువులు తోలిస్తాను. ఓ నెల రోజులు పోయాక ఫాస్పేట్, యూరియా, మొదలైన రసాయనిక ఎరువుల్ని పంపుతాను. మీ తోట ముచ్చటగా, కన్నుల పండువుగా పెరిగే ఏర్పాట్లన్నీ నేను చూస్తానండీ!

అమ్మగారూ! మీరేమీ ఆదుర్దా పడనవసరం లేదు" అన్నాడు బుల్లి కంట్రాక్టరు వినమ్రుడై గాలిలో చేతులు నలుపుకుంటూ.

"సరే, మంచిది అన్నది విశాలాక్షమ్మ వంట గదిలోకి వెళుతూ.

ఆ రోజు సాయంత్రమే బుల్లి కంట్రాక్టరు వంగ, బెండ, బీర, సొర, చిక్కుడు, టొమేటా, తోటకూర, పాలకూర, చుక్క కూర మొదలైన వాటి విత్తనాలను పంపాడు. ఆ మరునాడు పది బళ్ళ ఎరువు మట్టిని తోలించాడు. ఆ తర్వాత తనే స్వయంగా దగ్గరుండి విత్తనాలను నాటించి, పాదులు చేయించి మళ్ళు కట్టించి, నీళ్ళు పోయించాడు.

విశాలాక్షమ్మ నిత్యమూ ఓ కార్యక్రమంగా పెరటి తోట చుట్టు ఉదయమూ, సాయంత్రమూ తిరిగి వొచ్చేది. మొలిచే మొక్కల్ని పరిశీలిస్తూ ఉండేది.

ఆ పెరటి తోటపై ఇద్దరు జమానుల్ని పూర్తిగా నియమించింది. ఆ తోటకు రోజూ నీళ్లు పోయడమూ, ఎప్పటి కలుపు మొక్క అప్పుడు పీకి వేయడమూ, పాదులూ గట్లూ సరీగ్గా ఉన్నాయో లేవో చూడటమూ, ఎదుగుతూన్న మొక్కలకు ఆసరాగా చిన్న బొంగులు పాతడమూ, ఎదిగిన నారును నాటించడమూ, రసాయనిక ఎరువులు వేయించడమూ, తెగుళ్ళు తగిలిన వెంటనే మందులు చల్లించడమూ మొదలైన పనుల్ని జాగ్రత్తగా చేస్తూ పెరటి తోటను ప్రాణంగా చూసుకోవాల్సిన బాధ్యతా బరువుల్ని వాళ్ళపై విశాలాక్షమ్మ విధించింది. అంతే గాకుండా నిత్యమూ ఆవిడ పర్యవేక్షణ జరుగుతూనే ఉండేది.

మూడు మాసాలు గడిచాయి.

ఆ బంగళా వెనుక పెరటి తోట అద్భుతంగా తయారైంది.

రంగు రంగుల చీరెలు ధరించిన ముత్తయిదువుల చేరికవలె పెరిగిన చెట్లతో, మొక్కలతో పూచిన పువ్వులతో ఆ తోట ఉంది. వంగచెట్లు పూత పూచి పిందె వెయ్యడానికి ఆజీలుగా ఉన్నాయి; బెండ చెట్లకు కాయలు అంగుళం మేర వెళ్లుకొచ్చాయి; బీర పిందెల పువ్వులింకా రాలిపోలేదు; సొరచెట్లు నేలపారున అల్లుకున్నాయి. కాకర్లు పందిళ్ళమీద అల్లుకొని గంభీరంగా ఉన్నాయి; ఆకుకూర మళ్ళు ఏపుగా పెరిగాయి; ఇంకా వారం పది రోజులలో పెరటి తోటంతా తొలి కాపుకు రాగలదు. చూడటానికి ఆ తోట కన్నుల పండువుగా ఉంది.

బుల్లి కంట్రాక్టరు రెండు మూడు రోజుల కొకసారైనా వచ్చి ఆ తోటనూ, ఇంజనీరుగారి భార్యనూ దర్శించి పోతుండేవాడు. ఆ పెరటి తోటకు పాపం ఆయన చాల డబ్బు ఖర్చు పెట్టాడు. అయినప్పటికీ ఆయన రుణం ఏమీ అట్టిపెట్టుకోలేదు. భర్తకు చెప్పి నామినేషన్ మీద ఓ పదివేల రూపాయల వర్కును ఇప్పించింది. ఆ వర్కులో బుల్లి కంట్రాక్టరు పర్సంటేజులు పోను రెండువేల రూపాయలు మిగుల్చుకున్నాడు.

తన పెరటి తోట అంత ఏపుగా, అందంగా, గొప్ప ఫలసాయాన్నిచ్చేదిగా తయారు గావడం విశాలాక్షమ్మ కెంతో గర్వకారణంగా ఉంది. ఆ తోటను తిలకించినప్పుడల్లా ఆవిడ హృదయం సంతోషంతో పొంగిపోతూ ఉంటుంది. ఇంటికి వచ్చిన స్నేహితురాండ్రకూ, బంధువులకూ ఆ తోటను చూపెట్టి, వాళ్ళచేత పొగడ్తల ధూపం వేయించుకొంటూ వుంటుంది. ఆవిడ మనస్సు కెంతో సంతృప్తి.

ఆ తోట అంత సౌందర్యంగా, నిండుగా, శోభాయమానంగా తయారవడానికి బుల్లి కంట్రాక్టరే కాకుండా - జమాన్లు కూడా

కారణం. బుల్లి కంట్రాక్టరేదో విధంగా లాభించాడు. కాని పాపం ఆ జమాన్లకేమీ గిట్టుబాటు కాలేదు. వాళ్ళకి ఆవిడ కనీసం కాఫీ త్రాగమని పావలా డబ్బుల్ని కూడా ఇవ్వలేదు. అయితేయేం వాళ్లకొక ఆశ లేకపోలేదు; తోట కాపుకొచ్చింది. రేపో మాపో కూరగాయలు విరివిగా కాస్తాయి. వాటి నన్నింటినీ అమ్మగా రొక్కరే కూరలు వండుకొని తింటుందా? నిత్యమూ తమకు అన్నో యిన్నో కూరగాయలు తప్పకుండా యిస్తుంది.

కానీ వాళ్లకు తెలియదు — విశాలాక్షమ్మ తన పెరటి తోటలో పండిన కూరగాయలను రోజు విడిచి రోజు ఇన్‌కంటాక్సు ఆఫీసరు భార్యకూ, గవర్నమెంటు డాక్టర్ భార్యకూ, సబ్ జడ్జి గారి భార్యకూ, డి. వై. యస్. పి. గారి భార్యకూ పంపుతానని వాగ్దానాలు చేసి వున్నదని.

ఒకరోజు సాయంత్రం సూర్యుడు తాళ్ళ కరలోంచి ఎర్రగా నిష్క్రమిస్తూండగా, విశాలాక్షమ్మ పెరటి తోటలో విహరిస్తూ కూరగాయల చెట్ల నన్నింటినీ పరీక్షగా చూస్తూ, రెండు మూడు రోజులలో ఎన్ని వంకాయలూ, రామ ములక్కాయలూ కోత కొస్తాయో అంచనాలు వేస్తూన్నది. ఒక చెంపన జమాన్లు కడవలతో చెట్ల పాదలకు నీళ్ళు పోస్తున్నారు. అదే సమయాన విశ్వనాథరావు గబ గబా పెరటి తోటలోకి వచ్చాడు. విశాలాక్షమ్మకు ఆశ్చర్య మేసింది. భర్త రాకను గమనించగా. ఆయనకు పెరటి తోటపై వీసమెత్తు ఆపేక్ష గాని అభిమానం గాని లేవు.

"ఏమిటి హడావిడిగ వస్తున్నారు?" అన్నది విశాలాక్షమ్మ దగ్గరగా వస్తున్న భర్తకేసి చూసి. ఆయన మొహంలో దీపాలు

ఆరిన చీకట్లు తారట్లాడు తున్నాయి.

"మనకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్సు వచ్చాయి. ఇరవై నాలుగు గంటలలో ఈ వూరు విడిచిపెట్టి పోవాలి - చార్జీ మరొకళ్ళకు అప్పచెప్పి" అన్నాడు విశ్వనాథరావు తల వంచుకొని.

విశాలాక్షమ్మకు నిలువు గుడ్లు పడిపోయాయి. అంతమనిషీ ఆ మాటలకు మొదలు నరికిన అరటి చెట్టులా కూలిపోయింది. శరీరమంతా స్వేదంతో చిదరేసి పోయింది. కడుపులో ఏదో అరగని పదార్థం గుండ్రంగా తిరుగుతూన్నది. ఊహాల నిచ్చెన మీద పై మెట్టు వరకూ ఎక్కి, దభీమని క్రింద పడ్డట్టయింది. పువ్వూ, పిందె మీదున్న తోట సంధ్యా కాంతికి ఎర్రెర్రగా నవ్వుతూ అపహాస్యం చేస్తున్నట్లుంది. ఆ క్షణంలో ఆవిడ మనస్సులో బిల్డి కంట్రాక్టరూ, జమానూ, ఇన్‌కంటాక్స్ ఆఫీసరు భార్యా, గవర్నమెంటు డాక్టరు భార్యా. సబ్ జడ్జిగారి భార్యా, డి. వై. యస్. పి. గారి భార్యా...అందరూ తన పెరటి తోట దగ్గరకొచ్చి అట్టహాసం చేస్తూన్నట్లనిపించింది.

ఆ రాత్రి ఎనిమిది గంటలకు విశ్వనాథరావు ప్రక్కన సబ్ డివిజన్ ఆఫీసరుకు ఛార్జి అప్పగించాడు. మరునాడే ఆ వూరు వొదిలి వెళ్ళే ఏర్పాట్లు చేయసాగాడు.

ఆ రాత్రి విశాలాక్షమ్మ భోజనం చేయలేదు. పచ్చి మంచి నీళ్ళు కూడా పుచ్చుకో లేదు. ఆవిడ బుర్రంతా పళ్ళ చక్రం వలె తిరుగుతూనే ఉంది.

అర్ధ రాత్రి వరకూ ఆవిడ పెరటి తోటలో పిచ్చెత్తి నట్లు తిరుగుతూనే వుంది. భగవంతుడు తనకు అన్యాయం చేశాడు. కన్న పిల్లలకంటె శ్రద్ధగా, ప్రేమగా, అభిమానంగా, ప్రాణంగా పెరటి తోటను పెంచింది. అది కాపు కొచ్చింది. ఆ ఫలాన్ని

తను అనుభవించ కుండా వూ రొదిలిపెట్టి వెళ్లడ మేమిటి? తను కష్టపడి పండించిన పంటను మరో వాళ్ళు అనుభవించడమా? ... ఎట్లా సహించటం ?

వంట గది చూరులో ఉన్న పెద్ద కత్తిని తీసికొని, ఆ అర్థ రాత్రివేళ విశాలాక్షమ్మ పెరటి తోటలో కెళ్ళి వంగ, బెండ, కాకర, బీర, రామ్ములక్కాయ మొదలైన చెట్లనూ, ఆకుకూర మళ్ళనూ, పూల మొక్కలనూ మొదలంటా కోసి వేసింది. ఓ గంటలో తోట నంతా సర్వ నాశనం చేసింది. అప్పటికి గాని ఆవిడ ప్రాణంపై చల్లగాలి వీచలేదు. వెంటనే వెళ్ళి పడుకుంది. పది నిమిషాలలో ఆవిడకు నిద్ర పట్టింది.

తెల్లగా తెల్లవారాక నాశనమైన పెరటి తోటను చూసి జమాన్లు కేకలు వేశారు. విశ్వనాథరావూ, విశాలాక్షమ్మ, పిల్లలూ నిద్రనుంచి లేచారు.

"పచ్చటి తోటను ఇట్లా నాశనం చేసిందెవరు?" అన్నాడు విశ్వనాథరావు. జమాన్లు తమ కేమీ తెలియదన్నారు.

"పోతే పోనీయండి, మనం ఈ వూరు విడిచిపెట్టి పోతున్నాముగా! ఏమైతే మనకేం?" అన్నది విశాలాక్షమ్మ నిర్లిప్తంగా.

ఎవరో అసూయాపరుల కొంటె పని అనుకున్నారు.

ఆ రోజు ఉదయం తొమ్మిదిన్నర గంటల రైలుకు వాళ్ళు వెళ్ళవల్సి ఉంది. కాని, ఎనిమిదిన్నరకు సూపరింటెండింగ్ ఇంజనీరు ఆఫీసు నుంచి టెలిగ్రాం వచ్చింది — విశ్వనాథరావు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్సును రద్దు చేస్తూ, మళ్ళీ ఆయన్ను అక్కడే వుంచినట్టు తెలియ బరుస్తూ.

విశాలాక్షమ్మ పడక కుర్చీలో కుప్పగా కూలిపోయింది.

(ఆంధ్ర జ్యోతి)